# త్రైలోక్యగీత
# అష్టాదశాధ్యాయము
# విశేషాంశ జ్ఞాన యోగము

**త్రైలోక్యా ఉవాచ: -**

**సర్వజ్ఞ! భగవన్ దత్త! యోగ మార్గాయ మానవైః |**
**కే కే జ్ఞేయా విశేషాంశాః, బ్రూహి సంక్షిప్య సద్గురో! || 18.1||**

[**త్రైలోక్య అడిగింది:-** ఓ సర్వజ్ఞులైన దత్త భగవానుడా! ఓ దివ్య ఆధ్యాత్మిక ప్రబోధకా! భక్తమానవులు నడవ వలసిన యోగమార్గములో ఏ ఏ విశేషాంశములందు జాగ్రత్త పడవలెను? దయచేసి నాకు సంక్షిప్తముగా తెలుపగలరు.]

**శ్రీశ్రీశ్రీ దత్తస్వామీ ఉవాచ:-**

**సశమే! జ్ఞాన చర్చాయాం, సవేగే! కర్మ నిశ్చయే |**
**శృణు యోగే విశేషాంశాన్, త్రైలోక్యే! త్రిపుటి శ్రితాన్ || 18.2||**

[ **శ్రీ శ్రీ శ్రీ దత్తస్వామి వచించారు:-** ఓ త్రైలోక్య! ఆధ్యాత్మిక జ్ఞానము నేర్చుకొనుట యందు నీకు ఎంతో సహనము కలిగిన దానివై సత్యమును నిశ్చయిస్తున్నావు మరియు దానిని ప్రత్యక్ష సాధన యందు పెట్టడములో నీకు అత్యంత వేగమున్నది. **నేను** చెప్పున్న ఈ యోగమార్గములో ప్రఖ్యాతి చెందిన త్రిపుటిని ఆశ్రయించిన విశేషాంశములు వినుము. అవి ఏవి అనగా 1. మార్గములోని ప్రయాణికుడు, 2. మార్గము అంటే నడువ వలసిన మార్గము 3. లక్ష్యము అంటే ప్రయాణికుడు చేర వలసిన గమ్యము. ]

**సుమన స్సుతనౌ కుర్యాత్, శ్రమం చిత మద క్షయమ్ |**
**వ్యర్థ భాషణ చిత్రాది - వినోదాంశం పరిత్యజేత్ || 18.3||**

[ఆరోగ్యకరమైన శరీరములో ఆరోగ్యకరమైన మనసు నివసిస్తుందని చెప్పబడినది. కావున యోగమార్గములో నడవగోరే జిజ్ఞాసువు వీలైనంత వరకు ప్రతిరోజు శారీరక వ్యాయామము చేయవలెను. ఆ

విధముగా శరీరములో పేరుకుపోయిన క్రొవ్వు కరిగిపోతుంది. ఇది  మనసును మరియు మేధస్సును చాలా చురుకుగా ఉంచడములో సహాయ పడుతుంది. ఇంకా యోగమార్గము లోని సోపానాలను సరిగ్గా అర్థము చేసుకోవడములో తత్పరులను చేస్తుంది. దీనికి అదనముగా స్నేహితులతో వ్యర్థ సంభాషణలు, ప్రాపంచిక నేపథ్యములోని పుస్తకములను చదవడము, ప్రాపంచిక ఇతివృత్తముతో ఉన్న సినిమాలు చూడడము మొదలైన ప్రాపంచిక వినోదాంశాలను మానుకోవాలి.]

**ప్రత్యాహార శ్శమో నిత్యం, వ్యాయామ స్సగతి ర్దమః |**
**అనుద్వేగ క్రియానిష్ఠా - సిద్ధాసన సుహృద్ద్వయమ్ || 18.4||**

[మనసును నియంత్రించడమునకు సంబంధించిన మొదటి సోపానము అయిన '***శమము***', ఐదవ సోపానమైన '***ప్రత్యాహారము***' తో ముడిపెట్టబడినది. ప్రత్యాహారము అంటే బాహ్య ప్రపంచము నుండి మనసును తొలగించే ప్రక్రియ. రెండవ సోపానము '***దమము***', అనగా ఇంద్రియనిగ్రహము. మరియు నడకతో పాటు శారీరక వ్యాయామము చేయడము ద్వారా శరీర నిగ్రహము. శమము, దమము అనబడే ఈ రెండు సోపానాలు, మూడవ సోపానమైన '***ఆసనము***'నకు స్నేహితులు. ఆసనము అంటే భగవంతుని సేవలో స్థిరముగా ఉండటము, అంతే కాని  ఊరికే కూర్చోవడము కాదు. ఒక వ్యక్తి ఏదో ముఖ్యమైన పని కోసము ఒక నగరములో ఉండవలసి వచ్చినపుడు, లోకములో ఈ విధముగా చెప్పడము వాడుకలో ఉన్నది, 'ఆ పని కోసము అతడు ఆ నగరములో కూర్చున్నాడు'. కావున కూర్చోవడము లేదా ఆసనము అంటే ఆ ముఖ్యమైన పని చేయడము కోసము ఎలాంటి అలజడులు లేకుండ సంతోషముగా స్థిరముగా ఉండటము అనే అర్థములో తీసుకోవాలి. అందుకే '***ఆసనము***' అనేది '***స్థిరసుఖమాసనమ్***' అని నిర్వచింపబడినది. ]

**చిరాయ కుంభక స్సాధ్యః, ప్రాణాకర్షణ రక్తవాన్ |**

**విమలః పూరకో వస్త్ర - చ్ఛన్న నాసా ముఖో బహిః || 18.5||**

[ నాలుగవ సోపానము *'ప్రాణాయామము',* అనగా ఉచ్ఛ్వాసము - గాలిని లోపలికి పీల్చడము (పూరకము), ఆపి ఉంచడము (కుంభకము), మరియు ముక్కు ద్వారా గాలిని బయటికి పంపడము నిశ్శ్వాసము (రేచకము). గాలిని ఆపి ఉంచడము అనే ప్రక్రియ చాలా ముఖ్యమైన సోపానము, ఈ స్థితిలో ఎక్కువ సేపు ఉండటానికి సాధన చేయవలెను, ఎందుకంటే ఎంత ఎక్కువ సేపు ఈ స్థితిలో ఉంటే అంత ఎక్కువ సేపు శరీరములోని రక్తము, గాలిలోని ఆమ్లజని (ఆక్సిజన్) ని గ్రహిస్తుంది. ఈ ఆమ్లజని రక్తమును శుద్ధి చేస్తుంది, అంతేకాక మైటోఖాండ్రియా కణములలోని ఆహారము ఆక్సీకరణము చేయడములో సహాయపడి జడశక్తిని విడుదల చేస్తుంది. ఈ జడశక్తి శరీర అవయవములు వివిధ జీవక్రియలు చేయుటకు మరియు ప్రత్యేకమైన పనిచేస్తున్న మెదడులోని నాడీవ్యవస్థలో చైతన్యమును ఉత్పన్నము చేసే ప్రక్రియకు అవసరమైన మూలపదార్థము. గాలిని లోపలికి పీల్చే సోపానము కూడా ముఖ్యమైనది, ఎవరైనా బయటికి వెళ్లినప్పుడు, గుడ్డతో చేసిన మాస్కును ముక్కు-నోటిపై తప్పక ధరించాలి. ఇది గాలిలోని ఘనరూప ధూళికణాలను ఉచ్ఛ్వాసము ద్వారా లోనికి వెళ్లకుండా కాపాడుతుంది.]

**ధారణా గ్రహణం తస్య, నరోపాధే ర్దయాంబుధేః |**
**ధ్యానం భక్తి స్సమాధిశ్చ, నిశ్చయః కర్మ యోగినః || 18.6||**

[భగవంతుడు దయాసముద్రుడు, కాబట్టి మానవజాతిని ఉద్ధరించుటకు క్రిందకు వచ్చినాడు. అంతటి వర్తమాన నరావతారమైన భగవంతుడిని అందిపుచ్చుకోవడమే ఆరవ సోపానము అయిన ***'ధారణ'.*** ఒకవేళ భగవంతుడు ఊర్ధ్వ లోకాలలో తేజోరూపములోనే ఉండిపోతే, మానవులు తమ జీవితములో ఎంతో కాలము కఠిన తపస్సు చేస్తే తప్ప బహుకొద్దిక్షణాల పాటు తేజోరూపభగవంతుని చూడగలరు. భగవంతుని కొరకు చాలా సమయము వృథా కాకుండా రక్షించి, మానవుని అవతారుడై క్రిందకు భూమి మీదకు వస్తాడు. భక్తుడు భగవంతుని కలిసిన

తర్వాత ఆధ్యాత్మిక జ్ఞాన ప్రబోధము చేయగలడు. ఈ విధముగా భగవంతుడి కళ్యాణగుణముల సమాచారము అంతా తెలుసుకొని భగవంతునిపై భక్తి వృద్ధి చేసుకోవడమే ***'ధ్యానము'*** అనెడి ఏడవ సోపానము. వర్తమాన నరావతారమైనది భగవంతుడేనని దృఢనిశ్చయము కలిగి ప్రత్యక్ష భక్తి అనెడి కర్మయోగ సాధనను అమలుచేయడమే ఎనిమిదవ సోపానమైన ***'సమాధి'***. ఒకవేళ, ఆ విశ్వాసము శాశ్వతమైనది కాకపోతే అది ***'సవికల్ప సమాధి'*** , శాశ్వతమైతే అదే ***'నిర్వికల్ప సమాధి'***.]

**నరరూపం జగద్బ్రహ్మ, దత్తో యత్ ప్రణిధానతః |**
**మలం నశ్యే న్మహావృత్త్యా, శంకర స్వప్న వృత్తివత్ || 18.7||**

[నరరూపములో ఉన్న భగవంతుని అవతారమును చూసి మామూలు నరుడే అనే సంశయమునకు తెర తీస్తుంది. ఈ నరావతారమునే (పిండాండము) 'బాహ్య జగత్తు' (బ్రహ్మాండము) అంటారు. లోపల దాగి ఉన్న దత్త భగవానుడు లేదా అనూహ్య పరమాత్మయే భగవంతుడు లేదా బ్రహ్మము లేదా పరబ్రహ్మము. ఈ విధముగా భగవంతునిపైన మానవరూపము ఆవరించి ఉండటమే ఆదిశంకరాచార్యులు చెప్పిన 'అధ్యాసము'. కావున ప్రపంచము అంతా భగవంతునిపైన ఆవరించబడినది అనటము సరియైన అర్థము కాదు. ఎందుకంటే చూసేవాడు లేదా జీవుడు కూడా ఆవరించబడిన ప్రపంచములో ఒక చిన్న భాగము అయినందుకు, ఈ ఆవరణను దాటి బయటికి వచ్చి లోన దాగిన భగవంతుని జీవుడు ఎప్పటికీ చూడజాలడు. యథార్థమునకు ఈ ఆవరణకు సంబంధించిన అధ్యాస సిద్ధాంతమును (ఒక వస్తువును మరొక వస్తువుపై ఆరోపించుట) అద్వైత తత్త్వవేత్తలు భగవంతుడు మరియు ప్రపంచములను తలచి వృద్ధిపరిచినారు, కాని అది ఆ రెండిటి సందర్భములో విఫలమవుతుంది. కాని అధ్యాస సిద్ధాంతము, నరావతారమైన భగవంతుడిని చూసి మామూలు నరుడేమోనని పొరబడటము అనే సందర్భములో మాత్రము వర్తిస్తుంది. ఇలా సిద్ధాంతమును

వర్తింప జేయు సందర్భములో ఎలాంటి దోషములు లేవు. ఎందుకంటే, మానవుడు ప్రపంచమునకు సూక్ష్మరూపము అంటే పిండాండము వంటి వాడు, అదే స్థూలప్రపంచము అయితే బ్రహ్మాండము అనబడుతుంది. ఈ రెండింటి సారూప్యతలు ఏమిటంటే ఇవి తొమ్మిది అంశములను (నవావరణములు) కలిగి ఉంటాయి. వీటిలో ఎనిమిది అంశాలుగా 'అపరా ప్రకృతి', మరియు 'పరా ప్రకృతి' అనబడే ఒక అంశము ఉంటుంది. యోగసూత్రమును అనుసరించి ఇట్టి అధ్యారోపణము (చీకట్లో తాడును చూసి పాము అనుకొనుట) తొలగించుకొనుటకు భగవంతునిపై (తాడుపై) మనసు లగ్నము చేయవలెను (***ఈశ్వర ప్రణిధానాత్***). మళ్ళీ ఇక్కడ కూడా అద్వైత తత్త్వవేత్తలు ప్రతిపాదించిన ఆవరణ, విక్షేప, మల సిద్ధాంతములు సరిగా వర్తించవు. కాని మన అధ్యాస సందర్భములో అంటే వర్తమాన నరావతారమును మానవుడని భ్రమించు సందర్భములో మాత్రము ఈ సిద్ధాంతము సరిగా వర్తించగలదు. అద్వైత సిద్ధాంతములో :- అవరణ అంటే తాడు వంటి అసలైన అంశమును దాచి వేయడము. విక్షేపము అంటే పాము వంటి కొత్త వస్తువును దర్శించటము. మలము అంటే ఎన్నో జన్మల నుండి కొత్తవస్తువునే అసలైన వస్తువు స్థానములో దర్శించడము. విక్షేపము, అసలైన వస్తువుపై ఏకాగ్రతను ఉంచితే కొద్ది గంటలలో పోతుంది. అదే మలము, అసలైన వస్తువుపై ఏకాగ్రతను ఉంచితే కొద్ది జన్మలలో పోతుంది. ఈ విధముగా అసలైన వస్తువు మీద ఏకాగ్ర చిత్తులవడమే ***'ఈశ్వర ప్రణిధానము'.***

అద్వైత సిద్ధాంతములో అసలైన దేవుడు అనూహ్యమైన పరమాత్మ, కాబట్టి తనను ఎన్నటికీ ధ్యానించలేము అని భగవద్గీతలో చెప్పబడినది (**అవ్యక్తా హి గతిర్దుఃఖమ్**). ఈ కారణము చేతనే పతంజలి మహర్షి, మొదటి తేజోరూపమైన ఈశ్వరుడు లేదా దత్తుని ధ్యానించమని చెప్పినారు. నరావతారములో దత్తభగవానుడు అంతర్లీనముగా దాగి ఉంటాడు. మానవరూపము యొక్క ముద్ర మాత్రమే భక్తుల మనసులోకి

వస్తుంది. ఎందుకంటే గడచిన ఎన్నో జన్మల నుండి అటువంటి ముద్ర (వృత్తి) అంతర్లీనమైన దత్త దేవుని దాచి వేస్తుంది. వృత్తి లేదా ముద్ర అనే అసత్య స్థితి తొలగాలంటే సత్యమైన వృత్తి లేదా ముద్ర అయిన దత్త దేవుని మాత్రమే ధ్యానించాలి. అంటే ఏకాగ్రతతో దత్త దేవుని యందు గల భక్తి ఒక్కటే, నరావతారమును చూసినపుడు బాహ్యరూపమైన నరుడేమోననే బాహ్య ముద్రను నాశనము చేసి తుడిచి వేయగలదు. ఎందుకంటే ఒక వజ్రమే (వృత్తి), మరొక వజ్రమును(వృత్తి) కోయగలదు. ఇక విక్షేపము విషయానికొస్తే, ఆదిశంకరాచార్యులు ఇలా వివరించారు - ఒకడు తన కలలో పులిని చూసి భయపడితే, నిద్ర నుండి మేలుకొన్న తర్వాత కొంత సేపు కూడా ఆ భయము వెంటాడుతుంది. కొన్ని గంటలుగా ఆ కలలోని పులికి సంబంధించిన ముద్ర కారణముగా ఇలా జరుగుతుంది. కొన్ని గంటలు గడచిన తర్వాత మాత్రమే నిజమైన వృత్తిపై ఏకాగ్రచిత్తము ఏర్పడితే గాని కలపులి భయము తొలగదు.ఈ విధముగా అద్వైత తత్వము అంతా కూడా ఈ ప్రపంచమును బ్రహ్మము గానో లేదా భగవంతుని గానో చూపడానికి సహాయపడక పోయినను, నరావతారమైన దత్త దేవుడిని గుర్తించుటకు భక్తునికి ఉపకరిస్తుంది. కొద్ది గంటల పాటు నిల్చిన అసత్య ముద్రను విక్షేపము అని, కొన్ని జన్మల పాటు నిల్చిన అసత్య ముద్రను మలము అని అంటాము. కొద్ది గంటలుగా జీర్ణము కాని ఆహారమును విక్షేపము అంటే కొద్దిరోజుల పాటు జీర్ణము కాకుండా ఉండిపోయిన ఆహారమును మలము అంటాము. మలము ఎంతో ప్రమాదకరము. అద్వైత తత్త్వవేత్తలు ఎంతో శ్రమించి అధ్యారోపణము ద్వారా భగవంతునిపై ప్రపంచము యొక్క ఆవరణను వివరించదలిస్తే, దురదృష్టవశాత్తు చూచేవాడు లేదా జీవుడు ఆవరణము అయిన ప్రపంచంలోని భాగమే అయినందున వారి ప్రయత్నము ఫలించలేదు. యథార్థమునకు వీరి అధ్యారోపణ సిద్ధాంతము, చూసేవాని స్థానములో స్వయముగా భగవంతుడే ఉన్నట్లైతే, భగవంతుడు సత్యమైన, సంపూర్ణమైన వినోదము పొందడము కొరకు తానే తనపైన ఆ మూడు స్థితులు

(ఆవరణ, విక్షేప, మలములు) ఆవరించుకొని ప్రపంచమును సృష్టించుకుంటాడు అనడము అర్ధవంతము అవుతుంది. ఒకవేళ ప్రపంచమే భగవంతుని ఆవరించి ఉన్న నరుని రూపము అని సంబోధించ బడినది అనుకుంటే, నరావతారమును విశ్లేషించునపుడు, నరావతారమును సాధారణ మానవునిగా చూసే వారందరూ 'చూసేవారి' స్థానంలోకి వస్తారు. మరి వీరి కొరకే కదా ఈ సిద్ధాంతము. నరుడేనన్న అసత్యమైన ముద్రను తొలగించి సత్యమైన ముద్ర ఏర్పరచి తద్వారా నరావతారములో ఉన్నది భగవంతుడే అని సత్య సాక్షాత్కారము చేయడమే కదా మొత్తము అద్వైత సిద్ధాంతమార్గము. (చూసేవారి స్థానములో భగవంతుడు ఉండే ఒక్క సందర్భములో మాత్రమే అద్వైత సిద్ధాంతము వర్తిస్తుంది). దత్త దేవుని ధ్యానించినపుడు ఒకవేళ దత్త దేవుడు సంతోషిస్తే తన భక్తునికి దత్త దేవునిగా దర్శనమీయగలడు. అలా బాహ్యమైన మానవరూపము తాత్కాలికముగా అదృశ్యము అవుతుంది. ఎందుకంటే, అసత్యమైన మానవరూపము లేదా ప్రపంచము అనేవి యథార్ధ సత్యమైన భగవంతుడి చేత ప్రసాదించబడిన సత్యములు మాత్రమే, కావున అవి **తన** చేత తొలగించబడనూ గలవు. చీమలు పెట్టిన పుట్టలు పాములకు నివాసయోగ్యము అగును అన్నట్లు, పిసినారి ఒకడు ధనము కూడబెడితే అది రాజు చేత గ్రహింపబడి ప్రజాసంక్షేమము కొరకు వాడబడినట్లు లోకములో ఇలాంటి పోకడలున్నాయి.]

**త్రిమతైక్యం భిన్న భక్త- త్రయే ఽప్యవతారగమ్ |**
**విద్యుద్వల్ల్యోః పృథక్త్వం చా-పృథక్త్వం చైక్య మీక్షితమ్ || 18.8||**

[భక్తులు హిందూమతములోని ఉపమతములను విడదీయ రాదు, మరియు ప్రపంచములోని ఏ ఇతర మతాలతో కూడా హిందుమతమును విడదీయరాదు. భగవంతుని నరావతారము, పరబ్రహ్మము సంపూర్ణముగా విలీనమైనటువంటి విశేషముగా ఎన్నుకున్న మానవరూపాలైన రాముడు, కృష్ణుడు మొదలైన వారి

సందర్భములో ఆదిశంకరాచార్యులు చెప్పిన అద్వైతము సత్యము. రామానుజాచార్యుల విశిష్టాద్వైతము, భగవంతుని నుండి భక్తుడు విడదీయలేని భాగమని, సంపూర్ణము నుండి భాగము వలె, భగవానుడైన విష్ణువు మరియు ఆదిశేషుడు వలె అత్యంత సన్నిహితత్వము ద్వారా ఏకత్వమును ప్రతిపాదించును. భక్తుడు భగవంతుని నుండి వేరుగా ఉండటము అంటే యజమాని నుండి సేవకుడు వేరుగా ఉన్నట్లు, భగవంతుడైన రాముని నుండి హనుమంతుడు వేరుగా ఉండే స్థితియే మధ్వాచార్యుల ద్వైతము. ముగ్గురు వేర్వేరు స్థితులలోని భక్తుల కొరకు ఈ మూడు సిద్ధాంతములు ప్రతిపాదించి ఉన్నందున ఇందులో విభేదమేదీ లేదు. ఎందుకంటే, ఒక భక్తునికే ఈ మూడు చెప్పబడితే అది విభేదాలకు దారి తీసెడిది. ఈ మూడు సిద్ధాంతములు నరావతారమునకు మరియు తేజోరూప అవతారమునకు వర్తించును.

ఒక తీగలో విద్యుత్తు విలీనమైన విధముగా, ఒక మానవ శరీరమాధ్యమమును ఎన్నుకొని అందులో పూర్తిగా విలీనమవుతుంది. అద్వైతములో విద్యుత్తు మరియు తీగ అన్ని ప్రత్యక్ష అవసరాల కొరకు ఒక్కటిగానే ఉంటాయి. ఎందుకంటే తీగ మొత్తమును ఎక్కడ ముట్టుకున్నా షాకు తగులుతుంది. విశిష్టాద్వైతము మరియు ద్వైతములలో విద్యుత్తు మరియు తీగ అనేవి రెండు వేరుగా ఉంటాయి, ఎందుకంటే విద్యుత్తు అనేది ప్రవహించే స్వతంత్ర ఎలక్ట్రాన్ ల యొక్క సమూహము. తీగ అంటే లోహపరమాణువుల యొక్క హారము. విశిష్టాద్వైతములో విద్యుదీకరించిన ఒక తీగ యందు విద్యుత్తు మరియు తీగ అనేవి విడదీయలేని రెండు వేర్వేరు అంశములు. ద్వైతములో విద్యుదీకరణ పొందని తీగ యందు విద్యుత్తు మరియు తీగ అనేవి రెండు విడదీయగల వేర్వేరు అంశములు. ఈ విధముగా ఈ మూడు సిద్ధాంతములు, మూడు ప్రత్యామ్నాయ కోణములలో చెప్పబడినట్టి ఒకే సిద్ధాంతము.]

**మతే చోపమతే చైక్యం, పశ్యేత్ దాసం సుతం విభుమ్ |**
**స్థితం భాసి చాంతర్భాసి, స్వయం భాసి జగన్మతే || 18.9||**

[ప్రపంచములోని అన్ని మతాల ఐకమత్యము సాధించటము కొరకు పైన చెప్పిన మూడు సిద్ధాంతములు సమన్వయము కావాలి. ఎలాగంటే నరావతారము (లేదా తేజోరూపాత్మక అవతారము) భగవంతుడే అని భావించిన అది అద్వైతము. నరావతారము భగవంతుని కుమారుడు అని భావించిన అది విశిష్టాద్వైతము. ఒకవేళ నరావతారము భగవంతుని సేవకుడు లేదా దూత అని భావించిన అది ద్వైతము. అది ఫలరూపములో ఇలా కూడా చెప్పబడుతుంది, నరావతారము **స్వయం** ప్రకాశము (**అద్వైతము**), నరావతారము**లో ప్రకాశము** ఉన్నది (**విశిష్టాద్వైతము**), నరావతారమే **ప్రకాశములో** ఉన్నది (**ద్వైతము**). మొత్తము మీద భగవంతునితో యోగము పొందకోరిన సాధకుడు, ఎప్పుడైనా హిందూమతములోని ఉపమతములలో గాని, ప్రపంచ మతములలో గాని ఎలాంటి భేదభావమును కలిగి ఉండరాదు. ]

**కోఽపి జీవః క్షుధా మృత్యుం, ప్రాప్నుయాన్న దృశోః పురః |**
**క్షుధా శాంత్యై చ యద్వా తే, మహా ప్రీతి స్తతః ప్రభోః || 18.10||**

[నీ కళ్ళ ముందు ఆకలిగొన్న ఏ ప్రాణినీ చావనీయకుము. నీ ఆకలి తీర్చుకొనుటకు ఏ ప్రాణినీ చంపవద్దు. ఈ రెండు నియమాలను నీవు అనుసరిస్తే, దివ్యమైన పరమాత్మ నిన్ను చూసి ఎంతో ఆనందిస్తాడని **నేను** నిర్దుష్టముగా మీ అందరికీ చెప్పగలను.]

**తస్మై కాలార్థ శక్తి స్స్యాత్, ప్రవృత్తేః పరమన్వహమ్ |**
**దుర్వ్యయే చిత్తవృత్తీనాం, నిగ్రహే చ వచః క్రియాః || 18.11||**

[ప్రాపంచిక జీవితంలో ప్రతిరోజు నీ ప్రాథమిక అవసరాల నిమిత్తము సమయము, డబ్బు మరియు శక్తిని ఖర్చుచేసిన తర్వాత మిగిలిన సమయము, డబ్బు మరియు శక్తిని భగవంతుని సేవ కొరకే వినియోగించవలెను. ఒకవేళ నీవు అనవసరమైన

సందర్భములలో నీ మనసు మరియు ఆలోచనలు వృథా కాకుండా నియంత్రించగలిగితే, స్వాభావికముగా నీ ఎట్టి ప్రయత్నమూ లేక, నీ మాటలు, పనులు కూడా వృథా కాకుండా నియంత్రించబడతాయి.]

**మితా వృత్తి ర్న వాణిజ్య-వేశ్యా హేతుః పరీక్ష్యతే |**
**సుఖదా పరమానందా, ద్విధా యా బ్రహ్మలోకదా ||18.12||**

**[**నీవు ఒకవేళ నీ నిత్యజీవితమును ఎక్కువ కోరికలు లేకుండ సరళతరము చేసుకుంటే, నీకు భగవంతునితో వేశ్యాభక్తి మరియు వాణిజ్య భక్తి సంబంధము ఏర్పరచుకునే అవసరము ఉండదు. స్తోత్ర కీర్తనలతో ప్రార్థిస్తూ ప్రత్యక్ష భౌతిక ప్రయోజనాలు ఆశించెడి వేశ్యాభక్తిని మరియు భగవంతుని నుండి ప్రత్యక్ష వరములను పొందుటకు భగవంతునికి ప్రత్యక్ష వస్తు సమర్పణము చేయు వాణిజ్య భక్తిని నీవు తప్పక నిరోధిస్తావు. ఇక నీకు భగవంతుని చేత అదనపు ప్రలోభాలు చూపించబడుతూ అప్పుడప్పుడు పరీక్షలు జరుగుతాయి. నీవు ఈ విధానమునే అనుసరిస్తే నీ ప్రాపంచిక జీవితము ఎంతో సంతోషముగా ఉంటుంది. మరియు నీ ఆధ్యాత్మిక జీవితము కూడా శాశ్వతమైన ఆనందమును ఇస్తుంది. ఈ విధముగా నీవు ఇక్కడ అక్కడ ప్రయోజనములను పొందుతావు, చివరికి భగవంతుని నిలయమునకు చేరుతావు. ]

**యావాన్ క్షేమకర స్తావాన్, ప్రవృత్త్యర్థ స్తతో భవేత్ |**
**భుంజానం వాఽతి ధావంతం, ప్రాణ హాని స్సమావిశేత్ || 18.13||**

[ఒకవేళ నీవు పైన చెప్పిన నియమమును అనుసరిస్తే, భగవంతుడు నీకు ఎన్నో వస్తుభోగాది సంక్షేమములను ఇచ్చి, నీ ప్రాపంచిక జీవితమును ఎల్లప్పుడు క్షేమంగా ఉంచుతాడు. ఒకవేళ నీవు అతిగా ఆశిస్తే భయంకరమైన సమస్యల కోణములోకి వెళ్ళుట తప్పదు. కావున, అతిని సర్వదా నివారించాలి. ఒకవేళ ఒకడు

ఎక్కువ తిన్నా లేదా ఎక్కువ పరుగెత్తినా, అది ప్రాణాంతకమైన పరిస్థితికి దారి తీయుట చూచుచునే ఉన్నాము.]

**న జల్ప వశమాగచ్ఛేత్, మాయా భ్రాంతి ప్రదా ఽఽసురీ |**
**స్వప్రమాణ వివేకో వా, గురుర్వా కర్మ నిశ్చయే || 18.14||**

[నీవు ఎప్పుడూ అతిగా వాగే వారి నియంత్రణ లోకి వెళ్ళరాదు, అసత్యమైన సలహాలనే ఒప్పుగా భ్రమింపజేసి చివరికి వారు నిన్ను రాక్షసత్వములో ముంచుతారు. కావున నీవెప్పుడైనా అటువంటి అసత్య ప్రభావమునకు లోనై, నీ తొందరపాటు నిర్ణయాలను ఆచరణలో పెట్టే ముందు, నీ యొక్క పదునైన విశ్లేషణను ఉపయోగించుము లేదా నీ యొక్క సద్గురువును ఆశ్రయించుము.]

**మూఢో ఽప్యత్ర గురు స్స్యాతుం, యతేతా ఽహమికా వశః |**
**శ్రోతారం శిశుమాహన్యాత్, శశం సింహ ఇవాగ్రగమ్ ||18.15||**

[తెలివిలేని వాడైనా తన అహంకార ప్రభావము చేత ఇతరులకు ఉపదేశములను ఇవ్వవలయు ననుకుంటాడు. బాలల వంటి అమాయక ప్రజలు అటువంటి తెలివిలేని వాని ఉపదేశములను విన్నట్లైతే, సింహము నోటి ముందు నిలబడిన కుందేలును చంపినట్లుగా వారిని వాడు చంపును.]

**పాప శ్రమార్జితం పుత్రాన్, నాశయే ద్వర్ధయే న్మితమ్ |**
**జ్ఞానీ హి భక్తి సేవాభ్యాం, భగవత్కరుణా వరః || 18. 16||**

[అధర్మమార్గములో నీవెంత శ్రమించి అమితమైన ధనమును సంపాదించినను, అటువంటి సంపద నీ సంతానమును నాశనము చేస్తుంది. అదే ధర్మబద్ధముగా కొంచెమే సంపాదించినను, ఆ కొంత ధనమే అమితముగా పెరిగి నీ సంతానమునకు సహాయపడుతుంది. నిరంతర ప్రగతి కొరకు ఆధ్యాత్మిక జ్ఞానము, భగవంతుని పైన భక్తి, భగవంతునికి సేవ చేయడము అనేవి చాలా ముఖ్యమైనవి. ఈ విధముగా భగవంతుని అనుగ్రహము నీపై పడితే దివ్యవరములన్నీ పొందే యోగ్యత నీకు లభించును.]

**ప్రవృత్తిశ్చ నివృత్తిశ్చ, నేత్రే దృష్టిస్తు కేవలా |**
**పరమాత్మని కర్తవ్యా, యోగక్షేమ కరీ హి యా || 18.17||**

[ఆధ్యాత్మిక సాధకునకు ప్రవృత్తి లేదా ప్రాపంచిక జీవితము మరియు నివృత్తి లేదా ఆధ్యాత్మిక జీవితము అనేవి రెండు కళ్ళు. కానీ, కళ్ళు రెండైనా దృష్టి ఎప్పుడూ ఒక్కటే. అట్టి ఏకదృష్టి ఎప్పుడూ భగవంతుని యందే ప్రతిష్ఠించాలి. ఇది కొత్త ప్రయోజనాలు (**యోగము**) సమకూర్చుతుంది, మరియు ఇదివరకే ఉన్న సాధించిన ప్రయోజనములు సురక్షితములగును (**క్షేమము**).]

**నాచరన్న ప్యశక్తస్సన్, జగతాం పరివర్తనే |**
**త్రైలోక్యా దత్త సంవాదం, సోఽపి ముక్తః ప్రచారయన్ ||18.18||**

[త్రైలోక్యకు దత్త దేవుని నుండి ప్రసాదించబడిన ఈ ఆధ్యాత్మిక జ్ఞానమును ఆచరించుటకు అశక్తులైననూ, ఈ జ్ఞాన ప్రచారము ద్వారా ప్రపంచములో ఆధ్యాత్మిక సాధకులకు అందజేసినట్లైతే, అది సమస్త విశ్వమును ఉద్ధరించుటకు సహాయపడును. కావున ప్రచారము చేసినట్టి వ్యక్తి కూడా సకాలములో దత్త దేవుని అనుగ్రహమును పొంది మోక్షమును అందుకోగలడు.]

**వేద సాగర సత్తర్క-దత్త కూర్మస్థ మందరాత్ |**
**జ్ఞానామృతం సమున్నీతం, పిబంతు విబుధా స్సకృత్ || 18.19||**

[వేద సాహిత్యము అనేది శక్తిమంతమైన సముద్రము. పదునైన తర్కవిశ్లేషణయే ఆ సముద్రమును చిలికెడి మందర పర్వతము. ఇది దత్త భగవానుడనే కూర్మమును ఆధారముగా చేసుకొని నిలబడియున్నది. సత్యమైన ఆధ్యాత్మిక జ్ఞానమే వెలికితీయబడిన దివ్య అమృతము. శిష్టులైన సాధకులు (దేవతలు) ఈ దివ్యమైన

అమృతమును క్షణము ఆలస్యం చేయకుండా వెంటనే త్రాగుదురు గాక!]

**ఏవం దత్తగురు స్వామి - త్రైలోక్యా శిష్యయోః పఠన్ |**
**ప్రశ్నోత్తరార్థ వేదాంతం, అద్వైత ద్వైత ముక్తిమాన్ ||18.20||**

[త్రైలోక్య అనబడు శిష్యురాలికి మరియు గురురాజు అగు శ్రీదత్తునికి మధ్య ప్రశ్నోత్తర రీతిలో జరిగిన ఈ ఆధ్యాత్మిక జ్ఞానబోధ ఇంతటితో ముగిసినది. ఈ దివ్యమైన జ్ఞానమును అర్థము చేసుకున్న వ్యక్తి ఎవరైనా తాను ఎంచుకున్న మార్గమును బట్టి, దివ్యమైన తుది ఫలితములగు అద్వైత ముక్తి మరియు ద్వైత ముక్తిని పొందగలడు. అద్వైత ముక్తిలో జీవుడు భగవదవతారము అగును. ద్వైతముక్తిలో జీవునికి భగవంతుడు సేవకుడగును. ఈ రెండు ఫలములే పరమ మోక్షము.].

**|| ఓం జయ జయ జయగురుదత్త ఓం ||**
**ఇతి త్రైలోక్యగీతాయాం ' విశేషాంశ జ్ఞాన యోగో' నామ**
**అష్టాదశాధ్యాయః**
**|| ఇతి త్రైలోక్యగీతా సంపూర్ణా||**

**ఈ విధంగా త్రైలోక్యగీత యందు పదునెనిమిదవ**
**అధ్యాయమైన 'విశేషాంశ జ్ఞాన యోగము'**
**అనే అష్టాదశాధ్యాయము సమాప్తము.**
**||ఈ విధముగా త్రైలోక్యగీత సమాప్తము||**